నమస్తే తెలంగాణ

# మెదక్

I | హైదరాబాద్, శుక్రవారం 19 ఏప్రిల్ 2024 | MEDAK

## ప్రతిఒక్కరూ సమన్వయంతో పనిచేయాలి

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

కోహీర్, ఏప్రిల్18: జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ విజయానికి ప్రతిఒక్కరూ సమన్వయంతో పని చేయాలని మాజీ మంత్రి కేటీఆర్ సూచించారు. గురువారం జహీరాబాద్ ఎంపీ అభ్యర్థిగా కేసీఆర్ చేతుల మీదుగా బీఫామ్ తీసుకున్న గాలి అనిల్‌కుమార్‌కు కేటీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. ఎన్నికల్లో నియోజకవర్గ బాధ్యులు కష్టపడి పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కొనింటి మాణిక్‌రావు, పోచారం శ్రీనివాస్ రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, బేవరేజస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవీప్రసాద్, మాజీఎమ్మెల్యేలు క్రాంతికిరణ్, భూపాల్‌రెడ్డి, హనుమంతు షిండే, సురేందర్, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.



ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్, ఎమ్మెల్యేలు బీఆర్ఎస్ నేతలతో మాట్లాడుతున్న మాజీమంత్రి కేటీఆర్

## ఉధృతంగా పోస్టు కార్డు ఉద్యమం

### నిరసన తెలుపుతున్న పలు గ్రామాల రైతన్నలు



సిద్దిపేట రూరల్ : పోస్ట్ కార్డులతో నిరసన తెలుపుతున్న రైతులు


సిద్దిపేట రూరల్/నంగునూరు, ఏప్రిల్ 18 : రైతులకు ఇచ్చిన హామీలను రేవంత్‌రెడ్డి వెంటనే అమలు చేయాలని రైతులు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ రైతులకు ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోకపోవడంతో తెలంగాణ ఉద్యమగడ్డ సిద్దిపేట రైతులు పోస్టు కార్డు ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా సిద్దిపేట రూరల్ మండలంలోని తోర్నాల, బుస్సాపూర్ గ్రామల రైతులు గురువారం రేవంత్‌రెడ్డికి పోస్టుకార్డులను రాసి పంపారు. ఓటుతో తగిన బుద్ధి చెబుతామని తోర్నాల, బుస్సాపూర్ గ్రామాల్లో రైతులు నిరసన తెలిపారు. నంగునూరు మండల పరిధిలోని రాంపూర్‌లో రైతులు పోస్టు కార్డు ఉద్యమం చేపట్టారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి పోస్టు కార్డుల ద్వారా ఉత్తరాలు రాశారు. రైతులకు మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్, రూ.2 లక్షల రుణమాఫీ, ఎకరానికి రూ.15 వేల రైతుబంధు అమలు చేయాలని పోస్టు కార్డుల ద్వారా తెలియజేశారు. ఇచ్చిన హామీలను నెరవేర్చని పక్షంలో వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెబుతామన్నారు. రైతులకు బీఆర్ఎస్ పక్షాన పూర్తి మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు అనగోని లింగంగౌడ్, మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్‌రెడ్డి, నాయకుడు పరుశరాములు గౌడ్, గ్రామస్తులు పాల్గొన్నారు.



నంగునూరు : రాంపూర్‌లో పోస్టు కార్డులు పంపుతున్న రైతులు


## మూడోసారి విజయం సాధించాలి

- అభ్యర్థులకు సూచించిన కేసీఆర్
- మెదక్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి, జహీరాబాద్ అభ్యర్థి గాలి అనిల్ కుమార్‌కు బీఫామ్ అందజేత



కేసీఆర్ చేతుల మీదుగా బీఫామ్ అందుకుంటున్న మెదక్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి

సిద్దిపేట/ కోహీర్, ఏప్రిల్18: మెదక్, జహీరాబాద్ గడ్డపై మూడోసారి బీఆర్ఎస్ జెండాను ఎగురవేయాలని బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు అభ్యర్థులకు సూచించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో గురువారం జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్ కుమార్, మెదక్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి బీఫామ్‌లు అందజేశారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ ఎంపీ స్థానాలను మూడోసారి గెలిచి హ్యాట్రిక్ కొట్టాలన్నారు. ఎన్నికల ఖర్చుల కోసం రూ.95లక్షల చొప్పున చెక్కులు అందజేశారు. అనంతరం అభ్యర్థులు అధినేత కేసీఆర్ ఆశీస్సులు పొంది, నియోజకవర్గాల్లోని ప్రస్తుత పరిస్థితుల గురించి తెలియజేశారు. అభ్యర్థులు మాట్లాడుతూ తమపై నమ్మకం ఉంచి ఎంపీగా పోటీ చేసే అవకాశం కల్పించిన కేసీఆర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



కేసీఆర్ చేతుల మీదుగా బీఫామ్ అందుకుంటున్న జహీరాబాద్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్

## గ్యారెంటీలతో దగా చేసిన కాంగ్రెస్



బెజ్జంకి రోడ్‌షోలో మాట్లాడుతున్న హరీశ్‌రావు

బెజ్జంకి, ఏప్రిల్ 18: ఆరు గ్యారెంటీలు అని చెప్పి గద్దెనెక్కి మోసం చేసిన కాంగ్రెస్‌ను, తెలంగాణ ఏమీ చేయని బీజేపీని పార్లమెంట్ ఎన్నికల్లో బొందపెట్టాలని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు పిలుపునిచ్చారు. గురువారం రాత్రి సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో బీఆర్ఎస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థికి బోయిన్‌పల్లి వినోద్‌కుమార్‌కు మద్దుతుగా నిర్వహించిన బహిరంగ సభ, రోడ్ షోలో హరీశ్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలో వచ్చిన నాలుగు నెలల్లోనే ఇంతఘోరమైన పరిస్థితి ఎందుకు వచ్చిందో ప్రజలు ఆలోచించాలన్నారు. డిసెంబర్ 9న రుణమాఫీ చేస్తానని సీఎం రేవంత్‌రెడ్డి మాటతప్పిండన్నారు. రెండు లక్షల రుణమాఫీ అయినోళ్లు కాంగ్రెస్‌కు ఓటు వేయ్యాలి.. రుణమాఫీ కానోళ్లు బీఆర్ఎస్ ఓటు వేయలని కోరారు. రైతు భరోసా, వడ్లకు, మక్కలకు రూ.500 బోనస్ ఏమైందని కాంగ్రెస్‌ను హరీశ్‌రావు ప్రశ్నించారు. ప్రభుత్వం చేతకాని తనంతో రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని రైతులు రూ.1800 అమ్ముకుంటూ ఆర్థికంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ హయాంలో మద్దతు ధరకు గ్రామాల్లోనే ధాన్యం కొనుగోలు చేసి సకాలంలో రైతుల ఖాతాల్లో డబ్బులు వేశామని గుర్తు చేశారు. కౌలు రైతులకు రూ.15, వ్యవసాయ కూలీలకు 12 వేలు ఇస్తామని చెప్పి కాంగ్రెస్ ఇవ్వడం లేదన్నారు. కేసీఆర్ పాలనలో 24 గంటల కరెంట్ ఇస్తే, నేడు కాంగ్రెస్ పాలనలో 14గంటల కరెంట్ మాత్రమే వస్తున్నదన్నారు. కేసీఆర్ పాలనలో ఒక్క మోటర్ కాలలేదని, ఇప్పుడు కాంగ్రెస్ వచ్చాక ఎందుకు పెద్ద సంఖ్యలో మోటర్లు కాలుతున్నయో రైతులు ఆలోచించాలన్నారు. కరోన కష్టకాలంలో రైతుబంధు వేశామని, రైతుబీమా ఇచ్చినామన్నారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే మళ్లీ మోసం పోయే పరిస్థితి వస్తుందని, ప్రజల అప్రమత్తంగా ఉండాలని హరీశ్‌రావు పిలుపునిచ్చారు. నాలుగు వేల పింఛన్ ఇస్తామని, నాలుగు నెలలైందని, ఇప్పటికీ పింఛన్లు ఇవ్వ డం లేదన్నారు. జనవరి నెల పిం ఛన్ డబ్బులు ఎగ్గొట్టింది రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అన్నారు. పింఛన్‌దారులకు రేవంత్‌రెడ్డి ఎనిమిది వేలు బాకీ పడ్డాడని, ప్రతి మహిళకు రూ.12 వేలు ఇస్తానని చెప్పి ఇవ్వలేదన్నారు. ప్రతి మహిళకు ప్రభుత్వం రూ.పది వేలు బాకీ పడిందని, అవి తీర్చాక గ్రామాల్లోకి రావాలని కాంగ్రెస్ పార్టీ నాయకులకు నిలదీయాలన్నారు. కేసీఆర్ ఉండగా కల్యాణలక్ష్మికి లక్ష రూపాయల సహాయం చేస్తే..రేవంత్ రెడ్డి ఎన్నికల సమయంలో లక్షతోపాటు తులం బంగారం ఇస్తాని మాట చెప్పి తప్పినట్లు హరీశ్‌రావు తెలిపారు.



బెజ్జంకి రోడ్‌షోలో ప్రజలకు అభివాదం చేస్తున్న మాజీమంత్రి హరీశ్‌రావు, పక్కన కరీంనగర్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్



బెజ్జంకి రోడ్‌షోకు భారీగా తరలివచ్చిన ప్రజానీకం

### వినోద్‌కుమార్‌ను గెలిపించాలి

ఎంపీగా వినోద్‌కుమార్ వేయి కోట్ల రూపాయల నిధులు తెచ్చి కరీంనగర్‌ను స్మార్ట్ సిటీ చేశాడని, కరీంనగర్‌కు రైలు, జాతీయ రోడ్లు తెచ్చిండని, ప్రజల మనిషి వినోద్‌కుమార్‌ను మనం ఎంపీ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలని హరీశ్‌రావు కోరారు. బండి సంజయ్ ఐదేండ్లలో ఒక్క రూపాయి పని చేయలేదన్నారు. ఆంధ్రజ్యోతి రిపోర్టర్‌పై జరిగిన దాడిని ఖండిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ప్రకటించారు. బహిరంగంగా సభకు ప్రజలు భారీ ఎత్తున తరలిరావడంతో మండల కేంద్రం ప్రజలతో కిక్కిరిసింది. కార్యక్రమంలో ఆప్కాబ్ చైర్మన్ రవీందర్‌రావు, ఎంపీపీ లింగాల నిర్మల, పార్టీ మండలాధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ సబిత, ఎంపీటీసీ శారద తదితరులు పాల్గొన్నారు.

- ఎన్నికల్లో మోసం చేసిన కాంగ్రెస్‌ను, ఏమి చేయని బీజేపీని ఎంపీ ఎన్నికల్లో బొందపెట్టాలి
- ఐదేండ్లలో బండి సంజయ్ పైసా పనిచేయలేదు..
- వెయ్యి కోట్ల నిధులు తెచ్చిన వినోద్‌కుమార్
- కరీంనగర్ ఎంపీగా వినోద్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి
- బెజ్జంకి రోడ్‌షోలో మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు

## నామినేటెడ్ పదవుల్లో అన్యాయం

### మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వద్ద చేర్యాల కాంగ్రెస్ నాయకుల ఆవేదన



హైదరాబాద్‌లో మంత్రి కోమటిరెడ్డిని కలిసిన చేర్యాల కాంగ్రెస్ నాయకులు

చేర్యాల, ఏప్రిల్ 18: ఏండ్ల తరబడి కాంగ్రెస్ పార్టీ పటిష్టం కోసం పని చేసిన నాయకులను, కార్యకర్తలను చేర్యాల ప్రాంతంలో పార్టీ పెద్దలు దూరం పెడుతున్నారని, పదవులు ఇవ్వడం లేదని పలువురు కాంగ్రెస్ నాయకులు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. చేర్యాల మాజీ జడ్పీటీసీ కొమ్ము నర్సింగరావు ఆధ్వర్యంలో చేర్యాల, కొమురవెల్లి మండలాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గురువారం హైదరాబాద్‌లో మంత్రి కోమటిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కొంత మంది పార్టీలో చేరారని, అలాంటి వారికి నామినేటెడ్ పదవులకు ఎంపిక చేయవద్దని కోరారు. ఇటీవల పార్టీలో చేరిన కొంతమందికి నామినేటెడ్ పదవులు ఇచ్చారని, ఏండ్ల తరబడి పార్టీ కోసం పనిచేసిన వారికి అన్యాయం జరుగుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. సీనియర్ నాయకులు, కార్యకర్తలకు న్యాయం చేస్తానని మంత్రి కోమటిరెడ్డి హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ ఖాజా, నాయకులు ఎలుగల దుర్గయ్య, బొడిగం నర్సిరెడ్డి, ఎండీ జహంగీర్ తదితరులు ఉన్నారు.

## పాలిమార్ పరిశ్రమను సందర్శించిన పోలాండ్ బృందం

మనోహరాబాద్, ఏప్రిల్ 18 : మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం ముప్పిరెడ్డిపల్లి పారిశ్రామికవాడలోని పాలిమార్ స్టీల్ ప్రైవేటు లిమిటెడ్ పరిశ్రమను పోలాండ్ దేశ రాయబార బృందం గురువారం సందర్శించింది. పాలిమార్ స్టీల్ మేనేజింగ్ డైరెక్టర్ కేవీఆర్ సుబ్బారావుతో కలిసి పోలాండ్ రాయబారి చార్జ్ డీ ఎఫైర్స్ డాక్టర్ సెబాస్టియన్ డోమ్ జెలస్కీ, కాన్సుల్ జనరల్ డాక్టర్ అలెక్యాసందర్ దండా, పోలాండ్ కార్యాలయ ఆర్థిక వ్యవహారాల కౌన్సిలర్ కాన్సుల్ పావెల్ మోక్రజెకీ ప్లాంట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా పాలిమార్ స్టీల్ మేనేజింగ్ డైరెక్టర్ కేవీఆర్ సుబ్బారావు మాట్లాడుతూ... ముప్పిరెడ్డిపల్లి పారిశ్రామికవాడలోని పాలిమార్ స్టీల్ పరిశ్రమలో దేశంతో పాటు వివిధ దేశాలకు సంబంధించిన రైళ్ల ఉత్పత్తి కంపెనీలకు కీలకమైన విడి భాగాలను తయారుచేసి ఎగుమతులు చేస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం, టీఎస్ఐఐసీల మద్దతుతో ప్రపంచ వ్యాప్తంగా తమ సంస్థను విస్తరించేందుకు కృషిచేస్తున్నట్లు చెప్పారు. యూరోపియన్ రైళ్ల ఉత్పత్తి కంపెనీలకు సైతం ఇక్కడి నుంచే ఎగుమతి జరుగుతోందన్నారు. మరో మూడు ఎకరాలను విస్తరించి రూ. 2.50 మిలియన్ యూరోల పెట్టుబడి పెట్టి, ఎంతో మందికి ఉపాధి కల్పిస్తున్నట్లు చెప్పారు. ఇక్కడ తయారు చేస్తున్న ఉత్పత్తులను పోలాండ్ బృందం పరిశీలించిన సంతృప్తి వ్యక్తం చేసింది. అంతకుముందు పరిశ్రమ ఆవరణలో పోలాండ్ రాయబార బృందం మొక్కలు నాటారు. కార్యక్రమంలో పరిశ్రమ ప్రతినిధులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.




ముప్పిరెడ్డిపల్లి పారిశ్రామికవాడలోని పాలిమార్ స్టీల్ పరిశ్రమను సందర్శిస్తున్న పోలాండ్ రాయబార బృందం




బీజేపీ నుంచి నామినేషన్ వేస్తున్న రఘునందన్‌రావు

## తొలిరోజు ఐదు నామినేషన్లు

- ఎంపీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల
- మెదక్ స్థానానికి నాలుగు నామినేషన్లు
- జహీరాబాద్ స్థానానికి ఒక నామినేషన్

మెదక్, ఏప్రిల్ 18 (నమస్తే తెలంగాణ) : పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల పర్వం మొదలైంది. గురువారం కేంద్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసింది. మెదక్ కలెక్టరేట్‌లో రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో అధికారి రాహుల్‌రాజ్‌కు గురువారం తొలిరోజు మెదక్ ఎంపీ స్థానానికి నలుగురు నామినేషన్ పత్రాలను అందజేశారు. బీజేపీ ఎంపీ అభ్యర్థిగా రఘునందన్‌రావు జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్‌తో కలిసి నామినేషన్ వేశారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధు తరపున మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు ,డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, నర్సాపూర్ అసెంబ్లీ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డితో కలసి నామినేషన్ వేశారు. తెలంగాణ ప్రజాశక్తి పార్టీ తరపున దొడ్ల వెంకటేశం నామినేషన్ దాఖలు చేశారు. సత్వంత్ర అభ్యర్థిగా చిక్కుపల్లి నవీన్‌కుమార్ నామినేషన్ దాఖలు చేశారు.

### జహీరాబాద్‌కు ఒక నామినేషన్

సంగారెడ్డి కలెక్టరేట్, ఏప్రిల్ 18: పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల పర్వం మొదలైంది. గురువారం తొలిరోజు ఒక నామినేషన్ దాఖలైంది. జహీరాబాద్ పార్లమెంట్ స్థానానికి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా సురేశ్ శెట్కార్ తరపున ఒకసెట్ నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి వల్లూరు క్రాంతికి అందజేశారు. సురేశ్ శెట్కార్ అభ్యర్థిత్వాన్ని సాగర్ ప్రతిపాదించారు.




కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు తరపున నామినేషన్ వేస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్




స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్న చిక్కుపల్లి నవీన్‌కుమార్

## పార్లమెంట్ పోరు షురూ..

- జహీరాబాద్ పార్లమెంట్‌లో ప్రారంభమైన నామినేషన్లు
- నామినేషన్ల దాఖలు, ప్రచారంపై ప్రధాన పార్టీల దృష్టి
- రేపు నామినేషన్ వేయనున్న గాలి అనిల్‌కుమార్
- కేసీఆర్ బహిరంగ సభతో బీఆర్ఎస్‌లో జోష్, గెలుపే లక్ష్యంగా ముందుకు...

సంగారెడ్డి,ఏప్రిల్ 18 (నమస్తే తెలంగాణ): జహీరాబాద్ పార్లమెంట్‌లో ఎన్నికల వేడి రాజుకుంది. గురువారం నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. ప్రధాన రాజకీయ పార్టీలైన బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ, ఇతర పార్టీలు నామినేషన్లపై దృష్టిపెట్టాయి. ఎన్నికల ప్రచార జోరును పెంచాయి. ఓటర్లను ఆకట్టుకునేందుకు ప్రధాన రాజకీయ పార్టీలకు చెందిన అభ్యర్థులు జహీరాబాద్ పార్లమెంట్‌లోని అన్ని నియోజకవర్గాల్లో ఇంటింటి ప్రచారం చేపట్టేందుకు సన్నద్ధమవుతున్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీల ముఖ్యనేతలు తమ అభ్యర్థుల గెలుపు కోసం రంగంలోకి దిగనున్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో బహిరంగసభలు నిర్వహించి ఓటర్లను ఆకట్టుకునేందుకు సిద్ధమవుతున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రధాన రాజకీయ పార్టీలు పావులు కదుపుతున్నాయి. జహీరాబాద్ పరిధిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, యువత, రైతు ఓటర్లను తమవైపు తిప్పుకునేందుకు వ్యూహాలకు పదునుపెడుతున్నాయి.




సంగారెడ్డిలో తొలి నామినేషన్‌ను స్వీకరిస్తున్న రిటర్నింగ్ అధికారి వల్లూరు క్రాంతి

### 20న అనిల్‌కుమార్ నామినేషన్ దాఖలు

జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో గురువారం నుంచి నామినేషన్ల ప్రక్రియ మొదలైంది. ఈనెల 25వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. ఈనెల 26న నామినేషన్లను పరిశీలిస్తారు. 29న నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ ఉంటుంది. ఆ తర్వాత తుది అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తారు. మే 13న పోలింగ్ జరుగుతుంది. జహీరాబాద్ పార్లమెంట్‌కు సంబంధించి సంగారెడ్డి కలెక్టరేట్‌లో నామినేషన్లు స్వీకరిస్తున్నారు.నామినేషన్ల దాఖలుపై ప్రధాన రాజకీయపార్టీల అభ్యర్థులు సిద్ధమవుతున్నారు. గురువారం సంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి వల్లూరు క్రాంతి అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరించారు. తొలిరోజు కాంగ్రెస్ అభ్యర్థి సురేశ్ శెట్కార్ తరపున తొలిసెట్ నామినేషన్‌ను ఆ పార్టీ నాయకులు దాఖలు చేశారు. బీఆర్ఎస్ అభ్యర్థి అనిల్‌కుమార్ ఈనెల 20న పార్టీ ముఖ్య నాయకులతో కలిసి నామినేషన్ వేయనున్నారు. ఆతర్వాత 24న మరోమారు నామినేషన్ దాఖలు చేసే అవకాశం ఉంది. కాంగ్రెస్ అభ్యర్థి సురేశ్ శెట్కార్ 24న మరోమారు నామినేషన్ వేయనున్నారు. సురేశ్‌శెట్కార్ నామినేషన్ కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డితో పాటు కాంగ్రెస్ పెద్దలు హాజరయ్యే అవకాశం ఉంది. బీజేపీ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్ ఈనెల 22న నామినేషన్ దాఖలు చేయనున్నారు.

### బీఆర్ఎస్‌లో జోష్..హ్యాట్రిక్ గెలుపుపై దృష్టి

జహీరాబాద్ పార్లమెంట్‌లో హ్యాట్రిక్ గెలుపుపై బీఆర్ఎస్ దృష్టిపెట్టింది. తెలంగాణ ఆవిర్భావం నుంచి జహీరాబాద్ పార్లమెంట్‌లో వరుసగా రెండుమార్లు బీఆర్ఎస్ విజయం సాధించింది. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో సైతం బీఆర్ఎస్ విజయం ఖాయమని ఆ పార్టీ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. అనిల్ కుమార్ గెలుపుకోసం బీఆర్ఎస్ ముఖ్యనేతలు హరీశ్‌రావు, పోచారం శ్రీనివాసరెడ్డి స్వయంగా ప్రచారం చేస్తూ క్యాడర్‌ను ముందుకు నడిపిస్తున్నారు. అనిల్‌కుమార్ జహీరాబాద్ పార్లమెంట్ పరిదిలోని ఏడు నియోజకవర్గాల్లో త్వరలో ఇంటింటి ప్రచారం చేయనున్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అధ్యక్షతన సుల్తాన్‌పూర్‌లో మంగళవారం నిర్వహించిన సభ విజయవంతమైంది. సభ విజయవంతంతో బీఆర్ఎస్ క్యాడర్ ఫుల్ జోష్‌లో ఉంది.